క్లుప్తంగా

హజ్ యాత్రికులకు వ్యాక్సినేషన్

మదనపల్లె : పవిత్ర హజ్‌యాత్రలకు వెళ్లే వారికి గురువారం స్థానిక జిల్లా ఆస్పత్రిలో వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించారు. మదనపల్లె పరిసర ప్రాంతాల నుంచి 105 మందికి వ్యాక్సినేషన్ చేశారు. కార్యక్రమంలో హజ్‌కమిటీ సభ్యులు రఫీక్‌బేగ్, ఇస్మాయిల్, బషీర్, బాబు తదితరులు పాల్గొన్నారు.

లారీ అసోసియేషన్‌పై ఆరోపణలు అవాస్తవం



మాట్లాడుతున్న లారీ అసోసియేషన్ సభ్యులు

మదనపల్లె : మదనపల్లె లారీ అసోసియేషన్ సభ్యులు టమాటా మార్కెట్‌లో రైతులు, మండీ యజమానులకు ఇబ్బందులు కలిగిస్తున్నారని వస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని సభ్యులు హుసేన్‌బాషా, రోషన్, గంగాధర్ తెలిపారు. గురువారం స్థానిక లారీ అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ..పట్టణంలో వందల సంఖ్యలో కుటుంబాలు లారీలపై ఆధారపడి జీవించడం జరుగుతోందన్నారు. బయటిప్రాంతాల లారీల కన్నా, స్థానికంగా లారీ యజమానులు అధికంగా అద్దె వసూళ్లకు పాల్పడుతున్నారనేది అవాస్తవమన్నారు. వాహన నిర్వహణ, డ్రైవర్, క్లీనర్ల జీతభత్యాలు దృష్టిలో పెట్టుకుని లారీల బాడుగలు నిర్ణయిస్తున్నామే తప్ప అదనపు వసూళ్లు చేయడం లేదన్నారు. మదనపల్లెలో లారీల లోడింగ్‌కు టమాటా మార్కెట్ తప్ప పరిశ్రమలు, ఇతర వనరులు ఏవీ లేవన్నారు. మార్కెట్‌ను నమ్ముకుని లారీలను తిప్పాల్సి వస్తుందే తప్ప ఇతర బాడుగలు దొరకడం లేదన్నారు. దీంతో బయటిప్రాంతాల లారీలకు లోడింగ్ వేస్తే తమ జీవనోపాధికి ఇబ్బంది కలుగుతుందనే ఉద్దేశంతో అడ్డుకున్నామే తప్ప ఇందులో ఎలాంటి దురుద్దేశం లేదన్నారు. ఇక్కడ తాము ఎలాగైతే చేశామో... ఇతర ప్రాంతాలకు వెళుతున్నప్పుడు అక్కడి లారీ యజమానులు తమతో అలాగే ప్రవర్తిస్తున్నారని వాపోయారు. మదనపల్లె లారీ అసోసియేషన్ టమాటా మార్కెట్‌లోని రైతులకు, మండీ యజమానులకు వ్యతిరేకం కాదని, మీరు ఉపాధి పొందుతున్నట్లే మాకు ఉపాధి కల్పించాలనేదే తమ విన్నపమన్నారు.

రోప్ స్కిప్పింగ్ పోటీల్లో ప్రతిభ



క్రీడాకారులను సత్కరిస్తున్న కరస్పాండెంట్ ఆర్.గురుప్రసాద్ తదితరులు

మదనపల్లె : నేపాల్‌లోని ఖాట్మండులో జరిగిన సౌత్ ఏషియన్ రోప్ స్కిప్పింగ్ ఛాంపియన్‌షిప్-2024 పోటీల్లో మదనపల్లెకు చెందిన ఇండియన్ రోప్ స్కిప్పింగ్ ప్లేయర్స్ ఎస్.నిఖిల్‌నాయుడు, ఏ.జస్వంత్‌లు ఉత్తమ ప్రతిభ కనపరిచి బంగారు పతకాలను సాధించారు. ఈ సందర్భంగా... జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్.ఆర్.గురుప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి, అన్నమయ్యజిల్లా రోప్ స్కిప్పింగ్ ప్రెసిడెంట్ శిరీష రోప్ స్కిప్పింగ్ ప్లేయర్స్ ఎస్.నిఖిల్‌నాయుడు, జస్వంత్‌లను దుశ్శాలువతో సత్కరించి అభినందనలు తెలిపారు. మదనపల్లె నుంచి జాతీయస్థాయి క్రీడాపోటీల్లో విద్యార్థులు పాల్గొని మూడు బంగారు పతకాలను సాధించడం పట్టణానికి గర్వకారణమన్నారు. భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలో ఉత్తమ క్రీడాకారులుగా రాణించి మంచి పేరు, ప్రఖ్యాతులు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీడీ శరత్‌కుమార్‌నాయక్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా వేణుగోపాల స్వామి రథోత్సవం

కురబలకోట: మండలంలోని తెట్టు శ్రీ వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రథోత్సవం వేడుకగా సాగింది. భక్తులు ఆనందంతో భక్తి పారవశ్యంలో తేరు లాగారు. గోవింద నామస్మరణతో పరిసర ప్రాంతాలు మారుమోగాయి. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో అంగళ్లలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల నిర్వాహకులు భక్తులకు, సందర్శకులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. బుధవారం రాత్రి స్వామి వారి కళ్యాణోత్సవం కన్నుల పండగలా సాగింది. అనంతరం గరుడ వాహనంపై స్వామివారిని ఊరేగించారు.

ముగిసిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ

మదనపల్లె : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగుల కోసం ఐదురోజుల పాటు నిర్వహించిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ గురువారంతో ముగిసిందని నియోజకవర్గ ఎన్నికల అధికారి హరిప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 164-మదనపల్లె అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి 3,050 మంది పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకున్నారన్నారు. వారిలో ఈనెల 5న 1,904 మంది, 6న 701, 7న 188, 8న 142, 9న 61 మొత్తం కలిపి 2,996 మంది ఉద్యోగులు తమ పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకుని ఓటువేశారన్నారు. దరఖాస్తు చేసుకున్న వారిలో కేవలం 54 మంది మాత్రమే ఓటుహక్కును వినియోగించుకోలేకపోయారని తెలిపారు.

ఐదేళ్లు..అభివృద్ధి పరవళ్లు



రామసముద్రంలో నాడు-నేడులో అభివృద్ధి చేసిన పాఠశాల



మినికిలో నిర్మించిన సచివాలయం



రామసముద్రంలో నిర్మించిన రైతు భరోసా కేంద్రం



ఆర్.నడింపల్లిలో నిర్మించిన జగనన్న పాల వెల్లువ కేంద్రం

- ప్రజల చెంతకే సచివాలయ సేవలు
- ఆర్థిక సహాయంతో మహిళలకు పెద్దపీట
- డీబీటీ, నాన్ డీబీటీ కింద ప్రజలకు రూ. 346 కోట్లు లబ్ధి
- శ్రీవాలీశ్వరస్వామి కొండ అభివృద్ధికి రూ. 2కోట్లు మంజూరు

రామసముద్రం : కర్ణాటక సరిహద్దులోని మారుమూల మండలమైన రామసముద్రం మండలం వ్యవసాయానికి పెట్టింది పేరు. అయితే ఏ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండేది. నాయకులు రావడం.. హామీలు ఇవ్వడం తిరిగి ఎన్నికలు అయిపోగానే మిన్నకుండిపోవడం పరిపాటి. అయితే జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రామసముద్రం మండలానికి ఒక గుర్తింపు వచ్చింది. అన్ని రకాలుగాను.. అన్ని రంగాలలోను అభివృద్ధి బాటలో ముందుకు సాగుతుంది. ప్రజల వద్దకే పాలన పేరుతో గత ఐదేళ్లుగా జగనన్న పాలనలో గ్రామ సచివాలయాలు, ఆర్బీకే కేంద్రాలు, తారు రోడ్లు, సిమెంట్ రోడ్లు, వెల్‌నెస్ సెంటర్లు, పాల వెల్లువ కేంద్రాలు తదితర వాటితో అభివృద్ధి బాటలో ముందుకు వెళ్తుంది.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు:
కార్పొరేట్ పాఠశాలలను తలదన్నేలా ప్రభుత్వం నాడు-నేడు కింద ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసింది. దీంతో పాటు ఇంగ్లీష్ మీడియం చదువులను తీసుకొచ్చి పేద ప్రజలకు విద్యను మరింత చేరువ చేసింది. మండలంలో మొదటి విడత 21 పాఠశాలలకు గాను రూ. 5.6 కోట్లు, రెండవ విడత 26 పాఠశాలలకు రూ. 7.83 కోట్లు ఖర్చు చేసి పాఠశాలలను అంగరంగ సుందరంగా తీర్చిదిద్దడం జరిగింది. అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వివిధ అభివృద్ధికి నాడు-నేడు కింద రూ. 30లక్షలు మంజూరు చేసింది.

మహిళలకు పెద్దపీట:
మహిలళకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పెద్దపీట వేయడం జరిగింది. వారి అభివృద్ధి కోసం ఒకొక్క సభ్యురాలికి రూ. లక్షల్లో రుణాలు మంజూరు చేసింది. బ్యాంకు లింకేజి ద్వారా 594 సంఘాలు 5346 మంది సభ్యులకు రూ. 70.9 4కోట్లు అందజేయడం జరిగింది. అలాగే ఐదేళ్ల పాలనలో వైఎస్సార్ ఆసరా కింద 886 సంఘాలకు 8221 మందికి రూ. 20.58 కోట్లు, జగనన్న తోడు కింద 1608 మందికి రూ. కోటి 60 లక్షలు, వైఎస్సార్ చేయూత కింద 2815మందికి రూ.21 కోట్లు, సున్నా వడ్డీ పథకం కింద 1090 సంఘాలకు రూ. 9కోట్లు అందజేయడం జరిగింది.

పీహెచ్‌సీల అభివృద్ధి:
మరమ్మతులకు గురై అధ్వానంగా ఉన్న ప్రైమరీ హెల్త్ సెంటర్లను రోగులు, వైద్య సిబ్బంది కోసం నాడు-నేడు కింద ప్రభుత్వం అభివృద్ధి చేసింది. రామసముద్రం, చెంబకూరు, బొమ్మనచెరువు, సీటీఎం, నిమ్మనపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను రూ. కోటి 94 లక్షలతో అభివృద్ధి చేదయం జరిగింది. ప్రత్యేక భవనాలు, పెయింటింగ్, తాగునీరు, టైల్స్, మరుగుదొడ్లు తదితర వాటితో అందంగా తీర్చిదిద్దారు.

పాడి రైతులకు పాల వెల్లు కేంద్రాలు :
పాడి రైతుల ఆర్థిక అభివృద్ధి కోసం పాల వెల్లువ కేంద్రాలను నిర్మించడం జరిగింది. ప్రభుత్వం అమూల్ డెయిరీని తీసుకురావడంతో పాడి రైతులు పాలకు మంచి గిట్టుబాటు ధర లభిస్తుంది. రోజుకు 14వేల లీటర్ల పాలు పోస్తున్నారు. గతంలో లీటరుకు రూ. 22లు లభిస్తుండగా ప్రస్తుతం ప్రభుత్వం చలువతో లీటరుకు రూ. 34నుంచి రూ. 42ల వరకు గిట్టుబాటు ధర లభిస్తుంది. నెలకు పాడి రైతులకు రూ. 1.5కోటి బిల్లులు రైతులు అందుకుంటున్నారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వాలీశ్వరస్వామి కొండ అభివృద్ధికి రూ.2కోట్లు
రామసముద్రం ఆర్.నడింపల్లి పంచాయతీ బల్లసముద్రంకొండపై వెలసిన శ్రీ వాలీశ్వరస్వామి కొండకు రోడ్డు నిర్మాణం కోసం మట్టిని తోలేందుకు రూ. 2కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. త్వరలోనే పనులు ప్రారంభిస్తారు. గతంలో తారు రోడ్డు నిర్మాణం కోసం రూ.7.5కోట్లు మంజురు కాగా నిధులు చాలకపోవడంతో మరల రూ.1 2కోట్లకు ప్రతిపాదనలు పంపారు.

పేదలకు ఇళ్ల నిర్మాణాలు:
వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇల్లు లేని పేదలకు 2383 ఇళ్లు మంజూరు చేశారు. ఇంటి స్థలం లేని 327 మంది లబ్ధిదారులకు ఒకొక్కరికి 1.5సెంట్ల స్థలం కేటాయించి, వాటిని వారి పేరు మీద పట్టా రిజిస్ట్రేషన్ చేయించి, ఇంటి నిర్మాణాలు చేయించడం జరిగింది. లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణాలకు డీబీటీ కింద రూ. 29కోట్ల 7 5లక్షల నిధులు అందజేయడం జరిగింది.

రూ. 346కోట్లు డీబీటీ, నాన్ డీబీటి కింద లబ్ధి
వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల ప్రభుత్వ పాలనలో రామసముద్రం మండల ప్రజలు ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ రకాల సంక్షేమ పథకాల కింద ప్రత్యక్షంగా, పరోక్షంగా రూ. 346కోట్లు లబ్ధి పొందారు.

20న ఊటీకి ప్రత్యేక బస్సు సర్వీసు

మదనపల్లె : వేసవి సెలవులను పురస్కరించుకుని ఈనెల 20న ఊటీకి ప్రత్యేక బస్సు సర్వీసు నడపనున్నట్లు ఆర్టీసీ-1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఊటీ ప్రత్యేక బస్సు, మదనపల్లె ఆర్టీసీ బస్టాండ్ నుంచి ఈనెల 20న బయలుదేరి తిరిగి 23వ తేదీకి మదనపల్లెకు చేరుకుంటుందన్నారు. రానుపోను ఒకొక్కరికి రూ.2,800 ప్రయాణచార్జీగా నిర్ణయించామన్నారు. రిజర్వేషన్, ఇతర వివరాలకు 7382875034, 7382876658 నెంబర్లను సంప్రదించాలన్నారు. ప్రజల సౌకర్యం కోసం వేసిన ఊటీ ప్రత్యేక బస్సు సర్వీస్‌ను ఆదరించాలని కోరారు.

నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి



ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న ట్రైనీ ఐపీఎస్ అధికారులు, కేంద్ర సాయుధ బలగాలు

మదనపల్లె: సార్వత్రిక ఎన్నికలలో ప్రజలు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని సీఐలు వలీబాషు, ఎన్. శేఖర్, యువరాజు అన్నారు. గురువారం పట్టణంలో 9 మంది ట్రైనీ ఐపీఎస్ అధికారులు, కేంద్ర సాయుధ బలగాలతో డిఎస్పీ కార్యాలయం నుండి పుంగనూరు రోడ్డు, చిత్తూరు బస్టాండు, సీటీఎం రోడ్, టౌన్ బ్యాంక్ సర్కిల్, బెంగళూరు బస్టాండు,మెట్రో సర్కిల్,అంబేద్కర్ సర్కిల్, వరకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ప్రజాస్వామ్య పరిరక్షణకు తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ప్రజల తలరాతను మార్చే ఓటును ఆయుధంగా ఉపయోగించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో లో ట్రైనీ ఐపీఎస్ అధికారులు ధీరేంద్ర వర్మ, దివ్యానాష్, మహమ్మద్ ఈనాష్ అబ్దుల్ లతీఫ్, గజల్ ప్రీత్,నిమల్ హాం, సాక్షి కుమారి, శతి యారగట్టి,సుభంగి సుదర్శన్ కేకన్, అర్చనా మిట్టల్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినుల ప్రతిభ

మదనపల్లె సిటీ : స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు ఐదో సెమిస్టర్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనపరిచి 95శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ కృష్ణవేణి తెలిపారు. గురువారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. బీఎస్సీలో మహిర 9.5, బీఎస్సీ(సీబీహెచ్)లో అశ్విని, 9.0, బీ.కాం కంప్యూటర్స్‌లో మాధవి, 8.5 శాతం సాధించినట్లు తెలిపారు. వీరిని కళాశాల అధ్యాపకులు అభినందించారు.

జిత్తులమారి చంద్రబాబును నమ్మొద్దు

వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్



త్యాగరాజవీధిలో వైఎస్సార్ సీపీకి ఓటేయాలని ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్

మదనపల్లె : ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని అధికారం చేపట్టిన తర్వాత నెరవేర్చకపోవడం, టీడీపీ అధినేత చంద్రబాబు నైజం. జిత్తులమారి చంద్రబాబు మాయలో పడి మోసపోవద్దని ప్రజలకు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్ పిలుపునిచ్చారు. పట్టణంలోని 16, 20, 32,34,35 వార్డుల్లోని త్యాగరాజవీధి, పెద్దమసీదు, పెంచుపాడురోడ్డు, రాజానగర్, రామిరెడ్డిలేఅవుట్ వినాయకుని గుడి వీధి తదితర ప్రాంతాల్లో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా వార్డుల కౌన్సిలర్లు పెరవలిరాజేష్, వినుతాభాయి, రామిశెట్టిశివయ్య, ఎస్వీ.రమణ ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ఐదేళ్ల పాలనలో జరిగిన మేలును ప్రజలకు వివరించి, జగనన్న ప్రభుత్వంలో మంచి జరిగి ఉంటేనే ఫ్యాన్ గుర్తుపై ఓటువేయండని కోరారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి నిసార్‌అహ్మద్ మాట్లాడుతూ...2014 నుంచి 2019 వరకు టీడీపీ పాలనకు 2019 నుంచి ఇప్పటివరకూ సీఎం వైఎస్.జగనన్న పాలనకు తేడా గుర్తించాలన్నారు. 2014 ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని అధికారం చేపట్టిన తర్వాత చంద్రబాబు నెరవేర్చలేదని గుర్తు చేశారు. 2019 ఎన్నికల్లో కేవలం రెండుపేజీల మేనిఫెస్టోతో అధికారంలోకి వచ్చిన సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలను నెరవేర్చి ప్రజలకు ఇచ్చిన మాట నిలుపుకున్నారన్నారు. రాష్ట్రచరిత్రలోనే మరే ప్రభుత్వం అమలుచేయని విధంగా సంక్షేమ పథకాల ద్వారా పేదల జీవన ప్రమాణాలను మెరుగుపరిచారన్నారు. కుల,మత,పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా, లంచాలకు, అవినీతికి తావులేకుండా వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించారన్నారు. జగనన్న ఐదేళ్ల పాలనలో ప్రతి పేద కుటుంబానికి లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందిందన్నారు. అందుకే ప్రజలంతా ఎంతో సంతోషంగా మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారన్నారు. మే 13న జరగనున్న ఎన్నికల్లో రాజంపేట ఎంపీ అభ్యర్థిగా పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డికి, మదనపల్లె ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు ఫ్యాన్ గుర్తుపై రెండుఓట్లను వేసి, అత్యధిక మెజారిటీతో గెలిపించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఈశ్వర్‌నాయక్, వైఎస్సార్ సీపీ నాయకులు ఎస్.మస్తాన్‌ఖాన్, డాక్టర్.ఏవి.సుబ్బారెడ్డి, గార్లచంద్రమౌళి, డాక్టర్.అనిల్‌కుమార్‌రెడ్డి, మాజీ కోఆప్షన్ కరాటేఇస్మాయిల్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య వివరాలు నమోదు చేయండి



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ లక్ష్మి

మదనపల్లె : వైద్య సేవలు అందించే ప్రైవేట్ ఆసుపత్రులు, ఆరోగ్య పరీక్షా కేంద్రాలు, ఆరోగ్య కేంద్రాలు, ఆరోగ్య సిబ్బంది వివరాలను హెచ్.ఎఫ్.ఆర్(ఆరోగ్య సౌకర్యాలు కల్పించే కేంద్రాల రిజిస్ట్రేషన్)హెచ్.పి.ఆర్ (ఆరోగ్య సంరక్షకుల వృత్తిదారుల రిజిస్ట్రేషన్)చేసుకోవాలని అన్నమయ్య జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌ఓ లక్ష్మి, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ లోకవర్ధన్, జిల్లా జాతీయ ఆరోగ్య మిషన్ పర్యవేక్షణ అధికారి డాక్టర్ రియాజ్ బేగ్ అన్నారు. గురువారం మదనపల్లె పట్టణం లోని ప్రయివేటు ఆస్పత్రుల యాజమాన్యం నికి స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో హెచ్.ఎఫ్.ఆర్,హెచ్.పి.ఆర్ లపై డిజిటలైజేషన్ కార్యక్రమంలో భాగంగా ఒకరోజు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ ఆరోగ్య అధీకత సంస్థ(ఎన్ హెచ్ ఏ) దేశంలో ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ లో భాగంగా, పౌరులకు ఆయుష్మాన్ భారత్ కార్డుల ద్వారా కాగిత రహిత ఆరోగ్య సమాచారం అందించి, దేశంలో ఎక్కడి నుంచి అయినా మెరుగైన ఆరోగ్య సేవలు పొందేలా చర్యలు చేపట్టిందన్నారు. పేషెంట్ ప్రొవైడర్ సపోర్టింగ్ ఏజెన్సీస్టేట్ కోఆర్డినేటర్ చరన్ తేజ్,జిల్లా కోఆర్డినేటర్ రవికుమార్ లు ఎలా హెచ్.పి.ఆర్,హెచ్.ఎఫ్.ఆర్ పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డి ఎస్ ఎం ఓ విష్ణువర్ధన్ రెడ్డి, పీలేరు ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, దేవ శిరోమణి, హెల్త్ ఎడ్యుకేటర్ లు మహమ్మద్ రఫీ, టి.బి సూపర్వైజర్ ప్రభాకర్, ప్రైవేట్ ఆస్పత్రిలో యాజమాన్యం సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించండి





నిమ్మనపల్లె: ముష్టురులో ప్రచారం చేస్తున్న నిసార్ అహ్మద్ భార్య తస్లీమ్, కుమారుడు, నాయకులు, పెద్దతిప్పసముద్రం: బూర్లపల్లిలో ప్రచార దృశ్యం

నిమ్మనపల్లె : సార్వత్రిక ఎన్నికలలో రాజంపేట ఎంపీగా పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, మదనపల్లె ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్ అహ్మద్ ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని, మదనపల్లి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నిస్సార్ అహ్మద్, భార్య తస్నీమ్ , కుమారుడు మహమ్మద్ అబీద్ కోరారు. గురువారం ముష్టూరు పంచాయతీలోని ఎర్రప్పగారి పల్లె, వలస పల్లె ముష్టూరు గ్రామాలలోఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రచార కరపత్రాలను అందించి వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మద్దతు పలుకుతూ ఓట్లు వేయాలని అభ్యర్థించారు. మే 13న జరిగే ఎన్నికలలో మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డిని గెలిపించుకోవడానికి ప్రతి ఒక్కరు గెలిపించుకోవాలన్నారు. సర్పంచ్ చెంద్రాయుడు,నూర్ మొహిద్దిన్ ఖాన్, ఖాదర్ బాషా, మహమ్మద్ రఫీ, రాజగోపాల్,కొండెగాళ్ల రమణ, ముబారక్, ప్రసాద్, నారాయణ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించండి
రామసముద్రం: ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి నిస్సార్ అహమ్మద్, ఎంపీ అభ్యర్థి పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి లను గెలిపించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. గురువారం ఎన్నికల ప్రచారంలో భాగంగా రామసముద్రంలోని 1, 2,3,4 వార్డులలో జెడ్పీటిసి రామచంద్రారెడ్డి, మాజీ కన్వీనర్ భాస్కర్‌గౌడు, ఉపసర్పంచ్ తపాలా మస్తాన్, ఎంపీటీసీ మస్తాన్, దర్శన్ , కురిజల పంచాయతీలలో ఎంపీటీసీ దొడ్డిపల్లి ఆనంద ఆధ్వర్యంలో ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేస్తూ ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో ప్రభాకర్, కృష్ణప్ప, సమి, ఉదయ్, నారాయణస్వామి, కురిజలలో రెడ్డెప్ప, గోవిందు, నాగరాజ, విశ్వనాథ్, చంద్ర, ఉమాశంకర్, శంకర్‌నాయుడు, రాజన్న, నారాయణ , రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్‌గుర్తుకు ఓటేయాలని జోరుగా ప్రచారం
పెద్దతిప్పసముద్రం: రాజంపేట ఎంపీ, తంబళ్ళపల్లి ఎమ్మెల్యే వైఎస్సార్‌సీపీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డిలను గెలిపించాలని ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు ఓటర్లను కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం మండలంలోని ఉమ్మడి బూర్లపల్లి పంచాయతిలో విస్తృతంగా పర్యటించి ఫ్యాన్ గుర్తు ఓట్లు వేయాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అమలు చేయలేని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేయడం చంద్రబాబు నైజమైతే, ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేసిన ఘనత సీఎం జగనన్నకే దక్కిందని ప్రజలకు వివరించారు. నాయకులు మహమూద్, గణపతిరెడ్డి, డ్రిప్ రమణ, రియాసత్ అలీఖాన్, కేవీ రమణ, సుబ్బరాం, సుబ్బిరెడ్డి, నాగార్జున రెడ్డి, మోహన్‌రెడ్డి, చిన్నిపల్లి వెంకటరెడ్డి, కోట్లోని వెంకటరెడ్డి, ఎం. వెంకట్రమణ,బాపన నాగరాజు, బత్తల జయరాంరెడ్డి, నాగరాజు, సోమశేఖర్, రాజన్న, పాల శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రామసముద్రంలో ఎన్నికల ప్రచారం

సెక్టోరియల్ అధికారుల పాత్ర కీలకం



మాట్లాడుతున్న ఆర్వో హరిప్రసాద్

మదనపల్లె : పోలింగ్ ప్రక్రియలో సెక్టోరియల్ అధికారుల పాత్ర అత్యంత కీలకమని, వారు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి హరిప్రసాద్ అన్నారు. గురువారం సబ్ కలెక్టరేట్‌లో మదనపల్లె నియోజకవర్గానికి సంబంధించి సెక్టోరియల్ అధికారులకు ఎన్నికల విధులపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్వో హరిప్రసాద్ మాట్లాడుతూ... సెక్టోరియల్ అధికారులు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో మౌలికవసతుల కల్పనతో పాటు, పోలింగ్ కేంద్రాల్లో బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లను అమర్చడం, మాక్ పోలింగ్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. హ్యాండ్ బుక్‌లోని ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా తెలుసుకుని ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో కనీసవసతులు తాగునీరు, లైటింగ్, ఫ్యాన్లు, మరుగుదొడ్లు, మెడికల్‌కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, వీల్‌చైర్స్, సరైన విద్యుత్ ఏర్పాట్లు తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. వెబ్‌క్యాస్టింగ్ లేఅవుట్ ప్రకారం సరిచూసుకోవాలని, ఓటు గోప్యతను కాపాడాలని, పోలింగ్ కేంద్రంలోకి గుంపులుగా ఉండకుండా చూడాలని, ప్రిసైడింగ్ అధికారులు సమన్వయంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగేందుకు అన్నిరకాల చర్యలు చేపట్టాలన్నారు. పోలింగ్ రోజు ఉదయమే 5.30 గంటలకు మాక్‌పోలింగ్ ప్రారంభమయ్యేలా పోలింగ్ ఏజెంట్లు సకాలంలో హాజరయ్యేలా ముందే ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. రిజర్వు ఈవీఎం యంత్రాలను జాగ్రత్తగా పర్యవేక్షించాలని, పోలింగ్‌రోజుకు 72 గంటల ముందు నిర్వహించాల్సిన పనులు జాగ్రత్తగా చేయాలని, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఫిర్యాదులను పరిశీలించాలన్నారు. సెక్టార్‌కు సంబంధించిన ఈవీఎం యంత్రాల ఇంజనీర్లు, తహసీల్దార్, పోలీసు ఎస్‌హెచ్‌ఓల ఫోన్ నెంబర్లు దగ్గర పెట్టుకోవాలన్నారు.

నిస్సహాయులకు మిట్స్ సాయం

కురబలకోట: అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల సోషల్ రెస్పాన్సిబుల్ క్లబ్ మదనపల్లెలోని వెలుగు స్కూల్, వెలుగు ఓల్డ్ ఏజ్ హోమ్‌కు ఐదు ఫ్యాన్లు గురువారం విరాళంగా అందజేశారు. అక్కడున్న అనాథ పిల్లలకు భోజనం కూడా ఏర్పాటు చేసినట్లు క్లబ్ కోఆర్డినేటర్ షాహీద్ అహమ్మద్ తెలిపారు. కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు గ్రూప్‌గా ఏర్పడి రూ. 25 వేలు సేకరించి ఈ సాయం అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇంగ్లీష్ విభాగాధిపతి సమీనా, విద్యార్థులు పాల్గొన్నారు.